# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 16-05-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **సార్వత్రిక ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో 81.86 శాతం మేర పోలింగ్ నమోదైందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్‌కుమార్ మీనా తెలిపారు.**

2. **ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్-2024 - ఈఏపీసెట్ పరీక్షలు ఈరోజు ప్రారంభమవుతాయి**

3. **తెలంగాణలో ఖరీఫ్ పంటలకు అవసరమైన విత్తనాలను అందుబాటులో ఉంచేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు.**

4. **ఆంధ్రప్రదేశ్‌లోని 12 జిల్లాల్లో క్షయ వ్యాధి నియంత్రణకు బీసీజీ టీకా పంపిణీని ఈరోజు నుంచి రాష్ట్ర వైద్య శాఖ ప్రారంభించనుంది.**

5. **ఈరోజు దేశవ్యాప్తంగా జాతీయ డెంగీ నివారణ దినాన్ని పాటిస్తున్నారు.**

==========================

సార్వత్రిక ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో 81.86 శాతం మేర పోలింగ్ నమోదైందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్‌కుమార్ మీనా తెలిపారు. తుది పోలింగ్ శాతం వివరాలపై నిన్న వెలగపూడి సచివాలయంలో పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ, ఈవీఎంల ద్వారా 80.66 శాతం, పోస్టల్ బ్యాలెట్‌తో 1.2 శాతం మేర పోలింగ్ నమోదైందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఈవీఎంలన్నీ 350 స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచామని పేర్కొంటూ..

**.......వాయిస్ 35 సెకన్లు.....**

--------------------------

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 2024-25 విద్యా సంవత్సరానికి కళాశాలల ప్రవేశాలకు నిర్వహించే ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్-2024 -ఈఏపీసెట్ పరీక్షలు ఈరోజు ప్రారంభమవుతాయి. పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ కె. హేమచంద్రారెడ్డి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా 142 పరీక్ష కేంద్రాలు, తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లోని ఎల్బీనగర్, సికింద్రాబాద్‌లలోని రెండు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అగ్రికల్చర్,

ఫార్మసీ విభాగాలకు ఈరోజు, రేపు.. ఇంజినీరింగ్ విభాగానికి ఈ నెల 18 నుంచి 23 వరకు పరీక్షలను నిర్వహిస్తున్నామని తెలుపుతూ.....

**....వాయిస్ 32 సెకన్లు....**

---------------------------

తెలంగాణలో ఖరీఫ్ పంటలకు అవసరమైన విత్తనాలను ఈ నెలాఖరు నాటికి రైతులకు అందుబాటులో ఉంచేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. నిన్న హైదరాబాద్‌లో అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణలో పత్తి విత్తనాలను నిర్ణీత ధర కంటే అధిక ధరలకు విక్రయించే డీలర్లు, దుకాణదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పపంచ మార్కెట్లో ప్రత్తిపంటకు పెరుగుతున్న ఆదరణకు తగ్గట్లుగా ఈసారి 1.20 లక్షల BGII విత్తనాల ప్యాకెట్లను మార్కెట్లో అందుబాటులో ఉంచుతున్నట్లు చెప్పారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని 12 జిల్లాల్లో క్షయ వ్యాధి నియంత్రణకు బాసిల్ల స్కాల్మెట్ గ్వెరిన్-బీసీజీ టీకా పంపిణీని ఈరోజు నుంచి రాష్ట్ర వైద్య శాఖ ప్రారంభించనుంది. 60 ఏళ్లు పైబడిన వృద్ధులు, టీబీతో బాధపడుతున్న వ్యక్తుల కుటుంబ సభ్యులు, టీబీ చరిత్ర కలిగిన వారితో పాటు ధూమపానం చేసేవారు, మధుమేహ వ్యాధిగ్రస్తులు, వంటి వారికి తొలుత టీకాలు వేస్తారు. తొలి విడతగా ఎంపిక చేసిన 12 జిల్లాల్లో బీసీజీ టీకాను వేయనున్నారు.

---------------------------

తెలంగాణలోని పీజీ కళాశాలల్లో ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకాం, ఎంఈడీ, ఎంపీఈడీ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర కామన్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ ప్రవేశ పరీక్ష-టీఎస్ సీపీజీఈటీ జులై 5న జరగనుందని ఉన్నత విద్యామండలి తెలిపింది. నిన్న హైదరాబాద్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ లింబాద్రి సీపీగెట్ నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వెంకటేశం మాట్లాడుతూ తెలంగాణలోని ఉస్మానియా, కాకతీయ, శాతవాహన, తెలంగాణ, మహాత్మాగాంధీ, పాలమూరు, మహిళా విశ్వవిద్యాలయం, జేఎన్‌టీయూహెచ్ పరిధిలోని 297 పీజీ కళాశాలల్లో 51 కోర్సుల్లో ప్రవేశాలకు సీపీగెట్ నిర్వహిస్తున్నామని తెలిపారు. అభ్యర్థులు ఈనెల 18 నుంచి జూన్ 17వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. సీపీగెట్‌కి సంబంధించిన సమాచారాన్ని www.osmania.ac.in, మరొకటి www.cpget.tsche.ac.in వెబ్‌సైట్ల ద్వారా పొందవచ్చని చెప్పారు.

---------------------------

తెలంగాణలోని 10 విశ్వవిద్యాలయాలకు నూతన ఉప కులపతులను నియమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కమిటీని నియమించింది. విశ్వవిద్యాలయాలకు కొత్త ఉప కులపతుల నియామకం కోసం కేంద్ర ఎన్నికల సంఘం అనుమతినివ్వడంతో ఈమేరకు తెలంగాణ ప్రభుత్వం సెర్చ్ కమిటీ నియమించింది. తెలంగాణలో 16విశ్వవిద్యాలయాలు ఉండగా, వీటిలో బీఆర్అంబేద్కర్, ఉస్మానియా, కాకతీయ, తెలంగాణ, పాలమూరు, శాతవాహన, పొట్టి శ్రీరాములు తెలుగు, మహత్మాగాంధీ, జేఎన్టీయూ, జేఎన్ఎఫ్ఏయూ విశ్వవిద్యాలయాలకు ఉపకులపతుల పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం కమిటీని నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది.

---------------------------

దోమ కాటు వల్ల వ్యాప్తి చెందే డెంగీ జ్వరాన్ని నివారించడంలో ప్రజలలో చైతన్యం కలిగించే ఉద్దేశ్యంతో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ పిలుపుమేరకు ఈరోజు దేశవ్యాప్తంగా "జాతీయ డెంగీ నివారణ దినం"గా పాటిస్తున్నారు. దోమల నివారణకు, దోమల వ్యాప్తిని అరికట్టడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని చెప్పడమే ఈ కార్యక్రమ ముఖ్యోద్ధేశం. "డెంగీ నివారణ, సురక్షితమైన రేపటి కోసం మన బాధ్యత" అనే ఇతివృత్తంతో ఈ ఏడాది ఈ వ్యాధి నివారణకు అవగాహన ప్రచారం జరుగుతోంది.

---------------------------

ఉపాధి హామీ పథకం ద్వారా పనుల కల్పనలో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో నిలిచిందని కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ తెలిపింది. ఈ వేసవిలో ఏప్రిల్ 1వ తేదీ నుంచి మే 15వ తేదీ వరకు 6.99 కోట్ల పనిదినాల పాటు ప్రభుత్వం పని కల్పించిందని పేర్కొంది. ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా 18 వేల 299 పంచాయతీల్లో 45 రోజుల్లో మొత్తం 32.37 లక్షల కుటుంబాలు ఉపాధి పనుల ద్వారా వెయ్యి 713.27 కోట్ల రూపాయల మేర లబ్ధిపొందాయని తెలిపింది. అలాగే 45 రోజుల్లో 4.49 కోట్ల పనిదినాలు కల్పించి తెలంగాణ రాష్ట్రం దేశంలో రెండో స్థానంలో నిలిచిందని కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ వివరించింది.

---------------------------

ద్రోణి ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో రానున్న నాలుగు రోజులు పాటు మోస్తరు వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ తెలిపింది. ఆంధ్రప్రదేశ్‌లోని పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కృష్ణా, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలుకురిసే అవకాశం ఉందని తెలిపింది.

మరోవైపు తెలంగాణలో హైదరాబాద్‌తో సహా పలు జిల్లా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది. ముఖ్యంగా మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడం, రంగారెడ్డి, యాదాద్రి జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని తెలిపింది. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది.

---------------------------

తెలంగాణలో ప్రాంతీయంగా ఉండే సినిమా థియేటర్లలో రెండు వారాల పాటు చలనచిత్రాల ప్రదర్శనలు నిలిపివేయనున్నట్లు థియేటర్ల యాజమాన్యాలు ప్రకటించాయి. ప్రేక్షకులు రాక తక్కువగా ఉండటంతో నష్టపోతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దీంతో సినిమాల ప్రదర్శనలు ఆపాలని నిర్ణయించామన్నారు. నిర్వాహణ భారం వల్ల రేపటి నుంచి సినిమా థియేటర్లలో చిత్రాల ప్రదర్శనలు స్వచ్ఛందంగా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు.

---------------------------

పౌరసత్వ సవరణ చట్టం అమలులోకి వచ్చిన తర్వాత మొదటిసారిగా పౌరసత్వ ధృవీకరణ పత్రాలను నిన్న జారీ చేశారు. ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర హోంశాఖ కార్యదర్శి అజయ్ కుమార్ భళ్లా 14 మందికి పౌరసత్వ ధృవీకరణ పత్రాలను అందచేశారు.

======================